బస్తీలో శునక విహారం

- గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే బెంబేలు
- అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం



వీధిలో పదుల సంఖ్యలో సంచరిస్తున్న కుక్కలు

మణుగూరురూరల్: మణుగూరు మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు బయటికి రావాలంటే కుక్కల భయంతో వణికిపోతున్నారు. మండలంలో పలు చోట్ల కుక్కల దాడిలో గాయపడిన వారి పరిస్థితి ప్రస్తుతం వర్ణణాతీతంగా ఉంది. జిల్లా కలెక్టర్ వీధి కుక్కల ఎక్కువగా తిరుగుతున్న ప్రదేశాల్లో నిఘా ఏర్పాటు చేసి వాటిని పట్టుకునే వారిని ఏర్పాటు చేయాలని ఇప్పటికీ అనేక సార్లు అధికారుల సమావేశంలో ఆదేశాలు జారీ చేసినా.. మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వారి నిర్లక్ష్య వ్యవహార ధోరణికి ప్రజలు వీధికుక్కలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపలమార్కెట్, గాంధీబొమ్మసెంటర్, అంబేడ్కర్ సెంటర్, భగత్‌సింగ్‌నగర్, గోల్డ్‌షాప్స్ లైన్‌లలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ.. స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ప్రయాణం చేసి తమ ఇండ్లకు వెళ్లే వారిపై, అత్యవసర పరిస్థితుల్లో బయటికి వస్తున్న స్థానికులపై వీధి కుక్కలు గుంపులుగా దాడులు చేస్తున్నాయి. దాడి నుంచి సగటు మనిషి తమకు ఎటువంటి హానీ కలగకూడదని రాళ్లతో, కర్రలతో ప్రతిదాడి చేసినా.. పూర్తి స్థాయిలో ప్రయోజనం ఉండడం లేదు. కొంతమేరకు దాడిలో గాయాలపాలవుతున్నారు. అదే విధంగా రెండు రోజుల క్రితం సమితిసింగారం పంచాయితీ పరిధిలోని వాసవినగర్‌లో సుమారు ఐదు కుక్కలు మేకల మందపై దాడి చేశాయి. వాటిలో రెండు మేకలపై మూకుమ్మడిగా దాడి చేయడంతో సంఘటన స్థలం వద్దే ఆ మేకలు చనిపోయాయి. మేకల కాపరి కుక్కలు చేసిన దాడిలో రెండు మేకలను కోల్పోయి చేసిదేమి లేక కన్నీరు పర్యంతమయ్యాడు. ఉమారు కుక్కల దాడిలో చనిపోయిన మేకల విలువ రూ.20వేలు ఉంటుందని బాధిత మేకల కాపరి తెలిపాడు. తీవ్రస్థాయిలో వీధి కుక్కలు ప్రజలపై, మూగ జీవాలపై దాడులు చేస్తున్నా.. దాడుల్లో మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రజలు తీవ్ర గాయాలపాలవుతున్నా.. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారుఉ. తమ నిర్లక్ష్య ధోరణిని ఏమాత్రం వీడకుండా.. జిల్లా కలెక్టర్ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా మణుగూరు మున్సిపాలిటి అధికారులు, మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి వీధికుక్కలను అరికట్టాలని, ప్రజలను, మూగ జీవాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కలను అరికట్టాలి

మణుగూరు మండలంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వీధికుక్కలను అరికట్టాలి. వీధి కుక్కల వల్ల అత్యవసర పరిస్థితుల్లో రాత్రి సమయాల్లో బయటికి రావాలంటే భయం వేస్తోంది. మణుగూరు మున్సిపాలిటి అధికారులు వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి.

– దుగ్గల కార్తీక్, మణుగూరు

కార్యకర్తలకు అండగా ఉంటా



పొంగులేటికి స్వాగతం పలుకుతున్న మహిళలు

దుమ్ముగూడెం: తనను అభిమానించే వారికి, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం చర్ల పర్యటన ముగించుకుని దుమ్ముగూడెం మండల పర్యటనకు వచ్చిన ఆయనకు.. పర్ణశాల అడ్డరోడ్డు దగ్గర అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బండిరేవు శ్రీకృష్ణ ఆలయం దగ్గర ఆగగా.. గ్రామస్తులు గుడి పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు. మన అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించండి అన్ని నేను చూసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం చిన్న నల్లబల్లి గ్రామంలో అభిమానులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఆయన వెంట భద్రాచలం నియోజకవర్గం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మాజీ ఎమ్మెల్యే పినపాక పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ మాజీ సభ్యులు తుళ్లూరి బ్రహ్మయ్య, తోట రమేష్, బత్తుల శోభన్‌బాబు, పూజారి సూర్యచంద్ర రావు, 8 మంది సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనే ధ్యేయం




త్రీఫేజ్ విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి రూ.22 లక్షలతో చేపట్టిన నిరంతరం త్రీఫేజ్ విద్యుత్ లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి నిరంతరం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయటం జరుగుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలను సందర్శించారు. విద్యార్థునుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పదో తరగతి విద్యార్థినులకు పబ్లిక్ పరీక్ష హాల్ టికెట్లు అందించి, పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సున్నం లలిత, వైస్‌ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, సర్పంచ్‌లు పద్మ, చిరంజీవి, ఉప సర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, ఏఈ తరుణ్, నాయకులు భారత రాంబాబు, జంగాల ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలు చేతపట్టుకుని వీధుల్లో తిరిగారు. క్రీస్తు సువార్తను చాటిచెప్పారు. మణుగూరు మండల కేంద్రంలోని శివలింగాపురం పరిలూక్ దేవాలయం, అశోక్‌నగర్‌లోని సెంట్ జాన్ చర్చి, పీవీకాలనీలోని సెంట్‌పాల్ చర్చిలకు సంబంధించిన క్రైస్తవ కుటుంబాల వారు ఆయా చర్చిల పాస్టర్స్ ఈత మట్టలతో పట్టణంలో ప్రదర్శన చేశారు. క్రీస్తు సువార్తను ప్రజలకు తెలియజేశారు. గడ్‌ఫ్రైడే సందర్భంగా నిర్వహించే ఈమట్టల ఆదివారాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సెయింట్ జాన్ చర్చి, పాస్టర్ జర్మీయా, గ్రూప్ చైర్మన్ ధర్మయ్య, పాస్టరెట్ కమిటీ ట్రేజర్ వరపర్ల ప్రసాద రావు, మౌనిక తదితరులు కమిటీ సభ్యులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: ఈత మట్టలతో మణుగూరులో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



దుమ్ముగూడెం: మట్టల ఆదివారం వేడుకల్లో పాల్గొన్న సంఘస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ట్రినిటీ పెంతేకోస్తు సంఘం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతూ యేసు లోకరక్షకుడని, యేసే సత్యము, జీవము, మార్గమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్, సంఘ పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వినాయకపురం, నారాయణపురం, అనంతారం, మామిళ్లవారిగూడెం, ఆసుపాక, అశ్వారావుపేటలోగల చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత మట్టలు చేతుల్లో పట్టుకొని పుర వీధుల్లో తిరిగారు. కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ పెద్దలు బెంజిమెన్, సంద్రు భారతి, సంద్రు రమేష్, శ్యాం సుధాకర్, నెహ్రూ పాల్గొన్నారు.

గుండాల: విజయానికి చిహ్నంగా తాటి, ఈత మట్టలు చేత బూని క్రైస్తవ సోదరులు ఆదివారం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆయా మండల కేంద్రాల్లో క్రైస్తవులు పుర వీధుల వెంట హోసన్న, ఏసన్న క్రీస్తు ప్రభువుకు విజయం అంటూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక గీతాలాపన చేస్తూ వీధుల వెంట తిరిగారు. ఈ ఎందర్భంగా ఆళ్లపల్లి ఆర్‌సీఎం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ యాకోబు, సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ కేయిన్ సుధాకర్‌లు మాట్లాడుతూ.. మట్టల ఆదివారం ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పమర ప్రభాకర్, రాంబాబు, నాగేశ్వరరావు, రామూర్తి, ఆంతోని, రాములు, వెంకన్న, సులోచన, రుక్మిణి, స్వప్న, సుధాకర్, కన్నయ్య, మమత, సునీత, మనెమ్మ, ప్రమీల, రోజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో ఆదివారం మన ఊరు –మన సర్పంచ్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి రెండో వార్డులో పర్యటించారు. ప్రతి వీధిలో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మంచినీరు, వీధిలైట్లు, డ్రెయినేజీలు, పారిశుద్ధ్యం, రోడ్లు, ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు చల్లమల్ల శివారెడ్డి, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, చెంచు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో లచ్చిగూడెం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ.3వేలు షీల్డులను అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ స్పాన్సర్లు సొందె చెంచయ్య, పాయం బాబురావు, పాయం శ్రీను, పెనుబల్లి రవి, సందీప్, సర్పంచ్ ఇర్ప చంటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ మెంబర్, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ నాయకులు తుమ్మా రాంబాబు నివాసంలో ఆమె ఆదివారం మాట్లాడుతూ.. మండలంలోని గుమ్మడవల్లి వద్ద నిర్మిస్తున్న శ్రీగంగానమ్మ తల్లి ఆలయం వద్ద ప్రతిష్ఠించేందుకు తీసుకొచ్చిన ధ్వజస్తంభం దుంగను ముక్కలుగా నరికివేసి తీసుకెళ్లడం తగదన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. దీనిపై తాను జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అధికారికి సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజన్సీలో సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఐటీసీ ఎంఎస్‌కే ప్రాజెక్ట్ అధికారి కృష్ణ తెలిపారు. ఉన్నత చదువుల కోసం వెళ్తున్న కృష్ణను ఆదివారం భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, చెంగల్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవుల సంఘం మండల కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: చాత్తాద శ్రీవైష్ణవుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ ఆదేశాల మేరకు మండల కమిటీని సంఘం సభ్యలు ఆదివారం ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా శ్రీపెరంబుధూర్ రవి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శ్రీపెరంబుధూర్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా బుహ్వవరపు వీవీ రమణమూర్తి, కార్యదర్శి రామానుజం సీతారాములు, సహాయ కార్యదర్శులుగా శ్రీరంగం ప్రవీణ్, శ్రీపెరంబుధూర్ వేణుగోపాల్, గూడూరు కృష్ణలను ఎన్నుకున్నారు. అనంతరం వారు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం సభ్యులు మదన్‌మోహన్, టి.భాగ్యలక్ష్మి, బి.ఉదయ్‌కుమార్, ఎస్.శేషకుమారి, ఎస్.నాగేశ్వరరావు, శిరీష, ఆర్.మంగతాయారు, టి.కొండలరావు, ఎం.నరేందర్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



అశ్వారావుపేటరూరల్: సున్నంబట్టి పాఠశాలలో పరీక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ కృష్ణయ్య

దుమ్ముగూడెం: పదో తరగతి పరీక్షలకు మండల విద్యాశాఖ అధికారయంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 528 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మండలంలోని రేగుబల్లి ఆశ్రమ పాఠశాల, నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాల కొత్తపల్లిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు యంఈఓ సున్నం సమ్మయ్య తెలిపారు. ముగ్గురు చీఫ్ సూపరిండెంట్ అధికారులు,ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఒకరు కస్టోడియన్ అధికారి 30మంది ఇన్విజిలేటర్‌లను పరీక్షల నిర్వహణ కోసం నియమించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఏదైనా సమస్యతో పరీక్షా కేంద్రాల దగ్గరకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఏర్పడితే రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు విద్యార్థులకు అవసరమైతే లిఫ్ట్ ఇచ్చి పరీక్షా కేంద్రాల దగ్గర దించాలని కోరారు.

అశ్వారావుపేటరూరల్: నేటి నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు అంతా సిద్ధం చేసినట్లు ఆదివారం స్థానిక ఎంఈఓ పెండెకంట్ల కృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని సున్నంబట్టి, అశ్వారావుపేటలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి మొత్తం 536 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా సీహెచ్.నరసింహారావు, సీహెచ్.వెంకయ్య, ఎస్.పుల్లయ్యను నియమించామని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని అన్నారు.

గుండాల: నేటి నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. గుండాల గురుకుల పాఠశాల, ఆళ్లపల్లిలోని హైస్కూల్, కాచనపల్లిలో ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుండాల గురుకులంలో 130, కాచనపల్లిలో 96, ఆళ్లపల్లిలో 99 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు.

పదో తరగతే పునాది

మణుగూరురూరల్: ప్రతీ విద్యార్థి బంగారు భవిష్యత్తుకు పదో తరగతే పునాదిలాంటిదని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో ఆదివారం ఆయన ఏరియా సింగరేణి హైస్కూల్‌లోని పది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు, భయానికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో చదివి పది పరీక్షలను బాగా రాయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు.

కేసీఆర్ పాలన దేశానికి అవసరం



కరకగూడెం: చిరుమళ్లలో పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ రేగా, నాయకులు

కరకగూడెం: తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ ఆదర్శ పాలన దేశానకి ఎంతో అవసరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తొలుత వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన రూ.60 లక్షల శంకుస్థాపన పనులను ప్రారంభం చేశారు. సమత్ భట్టుపల్లి గ్రామంలో రూ. 2 కోట్లతో నిర్మించనున్న స్ట్రీట్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కళిక, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలి



పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీడీ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు శిక్షణ పొందిన ప్రతీ గిరిజన విద్యార్థిని, విద్యార్థులు ఉద్యోగం సాధిచాలని డీడీ రమాదేవి అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ భవనంలో ఆదివారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. ప్రస్తుతం పోలీసు శాఖలో అనేక ఖాళీలు ఉన్నాయని దాంట్లో ఉద్యోగం సంపాదించుకోవడం సులభం అని అన్నారు. 60 రోజుల పాటు ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు బాధ్యతగా శిక్షణ ఇచ్చిన ఫ్యాకల్టీకి, సహకరించిన అధికారులకు, సిబ్బందికి ధన్యావాదాలు తెలిపారు. ఏసీఎంఓ రమణయ్య, బాట్‌సింగ్, సతీష్, ఉపేందర్, విజయభాస్కర్, వేణు, అశోక్‌కుమార్, మోతిలాల్, వెంకన్న, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు నివాళి

హస్తినా పాలకుల వెన్నులో వణుకు పుట్టించి సమ సమాజ స్థాపనకు తన ప్రాణాలను ఫణంగా పెట్టిన తొలి తెలంగాణ తేజం, వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని డీడీ రమాదేవి అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, శ్రీనివాస్, భోజన్న, జూమ్లాల్, భాస్కర్, నర్సమ్మ, అనూష, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడికి చేయూత



రాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన సంఘ సేవకుడు గుమ్మడి రాజు అనారోగ్యంతో బాధపడుతుండగా పలువురు చేయూతనందించారు. మథర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.4 వేలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కొప్పుల మురళి, చేతన మీసేవ నిర్వాహకులు భూక్యా రంజిత్, విజయ్, గౌతమ్ రెడ్డి, విజయ్, టోనీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఐక్యత అవసరం

అశ్వారావుపేటరూరల్: వామపక్ష పార్టీల ఐక్యత అత్యవసరమని, రానున్న రోజుల్లో ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. స్థానిక ఆ పార్టీ ఆఫీసులో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని, దీని కోసం ఈ నెల 9వ తేదీ రెండు పార్టీల ఉమ్మడి సమావేశాన్ని హైదారాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారులకు కొమ్ము కాసే పాలకులను ఎదుర్కొవాలంటే వామపక్ష పార్టీల ఐక్యత అత్యవసరమని, అదే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ఉమ్మడి సమావేశంలో రెండు పార్టీల అగ్ర నాయకులు భవిష్యత్‌కార్యాచరణ రుపొందిస్తారని తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, బీ చిరంజీవి, దొడ్డా లక్ష్మీనారాయణ, మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రవాణాకు అడ్డుకట్ట పడేనా..?



చింతిర్యాలలో గోదావరి రేవు వద్ద కందకాలు తవ్విస్తున్న రెవెన్యూ అధికారులు

అశ్వాపురం: మండలంలో చింతిర్యాల, అమ్మగారిపల్లి, అమెర్ద గోదావరి రేవుల వద్ద రెవెన్యూ అధికారులు కందకాలు తవ్వించినా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడటం లేదు. రెవెన్యూ అధికారులు కందకాలు తవ్వించినప్పటికీ, ఇసుకాసురులు కందకాలు పూడ్చివేసి ఇసుక దందా సాగిస్తున్నారు. అధికారులు తూతూమంత్రం చర్యలతో మండలంలో పగలు, రాత్రి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులూ లేకుండా వందల ట్రాక్టర్ల ఇసుకను గోదావరి నుంచి ఇసుక ట్రాక్టర్ల యజమానులు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు తహసీల్దార్ ఎంఏ.రాజు మార్చి 14న అమ్మగారిపల్లి, అమెర్ద, చింతిర్యాల గోదావరి రేవుల వద్ద కందకాలు తవ్వించారు. రెండు రోజులకే కందకాలు పూడ్చివేసి ఇసుక అక్రమ రవాణా సాగించారు. రాత్రి పూట ఇసుక ట్రాక్టర్ల అతి వేగంతో రాత్రంతా కంటి మీద కునుకు ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. మండలంలో పలు చోట్ల ఇసుక నిల్వలు భారీగా ఉన్నాయి. ఆదివారం చింతిర్యాల గోదావరి రేవు వద్ద మరల తహసీల్దార్ రాజు ఆధ్వర్యంలో కందకాలు తవ్వించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి ట్రాక్టర్లు సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

క్లుప్తంగా

మహిళల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

బూర్గంపాడు: మహిళలు ఆరోగ్యంపై మరింత జాగ్రత్తలు వహించాలని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్దార్థ మోహంతి అన్నారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఆదివారం సారపాక రాజీవ్‌నగర్‌లోని సత్యసాయి మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళల ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపంతో అనేక శారీరక రుగ్మతలు పెరుగుతున్నాయన్నారు. మహిళలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు వహిస్తు సరైనా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో 500మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యభాస్కర్‌రావు, డాక్టర్ విజయ్‌కుమార్, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు, షేక్ భాషా, గిరీష్, భద్రాద్రి మహిళ సమితి వైస్ ప్రెసిడెంట్ సునీత మోహంతి, కార్యదర్శి రష్మీ శ్రీధర్, లక్ష్మీ రాంబాబు, పుష్ప భాస్కర్, గాయత్రి, పాకాల దుర్గాప్రసాద్, బసప్ప రమేష్, యడమకంటి సుధాకర్‌రెడ్డి, తిరుపతి ఏసుబు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేయాలి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ, ప్రైవేటు రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు కేవలం బియ్యం మాత్రమే ఇవ్వడం తగదని, పేదలకు ఆయా షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను అందించాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చల కల్పన, వాసం బుచ్చిరాజు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాపంథా పార్టీ ఆఫీసులో ఆదివారం జరిగిన పాల్వంచ డివిజన్ జాయింట్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యంతోపాటు, వంట నూనె, కందిపప్పు, పెసర పప్పు, గోధుమ పిండి, పంచదార, టీపొడి, ఉప్పు, కారం, పసుపు, చింతపండు, పల్లీలు, సబ్బులు ఇవ్వాలని కోరారు. దీనిపై ఈ నెల 15 వరకు పార్టీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. సమావేశంలో కావడిగుండ్ల సర్పంచ్ కంగాల భూలక్ష్మి, కుంజా అర్జున్, నూపా సరోజినీ, తోడెం దుర్గ, గోగినపల్లి గంగా, కొండ్రు లక్ష్మి, తెల్లం బంగారమ్మ, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

దుమ్ముగూడెం: మండలంలోని జిన్నగట్ట గ్రామంలో ఆపక లక్ష్మయ్య, అపక తిరుపతిరావు, సోందె చిలకమ్మలకు చెందిన ఒక ఆవు రెండు ఆవు దూడలు కడుపు ఉబ్బి చనిపోయాయని, వాటికి నష్ట పరిహారం చెల్లించాలని మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి సంబంధిత పశు వైద్య అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. రేపు మారాయిగూడెం పంచాయతీ జిన్నగట్ట గ్రామంలో కాళ్లవాపులు, కడుపు ఉబ్బడం వ్యాధి నుంచి రక్షించి పశువులకు మెరుగైన వైద్యం అందించాలని, చనిపోయిన మూడు పశువులకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించి ఆ మూడు కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అపక రంగయ్య, కొరస వీరస్వామి, అపక తిరుపతిరావు, సోంది చిలకమ్మ, అపక లక్ష్మయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలి

భద్రాచలంటౌన్: యువత కష్టపడి చదువుకొని జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని టీఎన్జీఓ డివిజన్ అధ్యక్షుడు డెక్క నరసింహారావు అన్నారు. భద్రాచలం పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో ఆదివారం రామయ్య అకాడమీ ఆఫ్ కంపిటేషన్ ఎగ్జామ్స్(ఆర్ఏసీఈ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భద్రాచలం ఏజన్సీలోని గిరిజన యువతి, యువకులకు ఉగ్యోగాలను సాధించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిన సంస్థ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏసీఈ డైరెక్టర్ ఆర్‌పీ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, ఆర్గనైజర్ వి.వినోద్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్ మృతి

దమ్మపేట: కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్, వైస్ చైర్మన్ నాయుడు చెన్నారావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మపేట మండల కేంద్రంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న నాయుడు చెన్నారావు.. గత కొంతకాలంగా కేన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. హైదారాబాద్‌లో చికిత్స తీసుకుని ప్రస్తుత ఇంటి వద్ద విశ్రాంతిలో ఉండగా, ఆదివారం తీవ్ర అనారోగ్యంతో మరణించాడు. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నాయుడు చెన్నారావు భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటుగా జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, రావు జోగేశ్వరరావు, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు తదితర నాయకులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.